# మనస్సు, శరీరము ఆరోగ్యముగా ఉన్నప్పుడే సత్సంకల్పములు అభివృద్ధి కాగలవు

ఒకనాడు యోగంబు ఒకనాడు రోగంబు
  అనుభవించెడువారి నరయుచుంటి
ఒకనాడు త్యాగంబు ఒకనాడు భోగంబు
  అనుభవించెడివారి నరయుచుంటి
ఒకనాడు సంపత్తు ఒకయేడు దారిద్ర్యము
  అనుభవించెడివారి నరయుచుంటి
ఒకనాడు దుఃఖము వేరొకనాడు సుఖంబు
  అనుభవించెడివారి నరయుచుంటి
ఇందు సుస్థిరమైనది యెద్ది లేదు
స్థిరము కానట్టిదానికి మురిసిపోక
సత్యనిత్యము జ్ఞానంబు అనంతమైన
ఆత్మతత్త్వమెరుంగుడో ఆర్యులార!
భుక్తివిద్యలెన్నో భక్తితో చదివేరు
ముక్తివిద్యకెవడు ముందురాడు
ఇట్టివాడు దైవమెరుగంగ నేర్చునా
ఎట్టి విద్యలుండి యేమి ఫలము

దివ్యాత్మస్వరూపులారా!

మాతృదేశపు ఉజ్వలభవిష్యత్తుకు నేటి బాలబాలికలే ఆశాకిరణములు. వారే రేపటి

srisathyasaivachanamrutam

పౌరులు. నిత్యజీవితమును నైతిక మార్గములో ఆదర్శవంతమైన జీవితముగా మల్చుకోవటానికి విద్యార్థి, విద్యార్థినులు కృషిచెయ్యాలి. ఈ నైతిక ఆదర్శములకొరకే విద్యార్థులు జీవించాలి. జీవితములో యెట్టి బాధలకైనా యెదుర్కొని పరిపూర్ణస్వేచ్ఛను సంపాదించుకోవాలి. 'స్వేచ్ఛ' అనగా కేవలము మృగములవలె, పక్షులవలె యిష్టానుసారము సంచరించటము కాదు. ఆత్మగౌరవము, ఆత్మనిగ్రహము, ఆత్మజ్ఞానము, ఆత్మానందముతో జీవించటమే పరిపూర్ణమైన స్వేచ్ఛకు సరైన అర్థము. ఇట్టి పవిత్రమైనటువంటి స్వేచ్ఛను సంపాదించుకున్నప్పుడే మానవుడు యీ జగత్తునందు ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపగలడు.

మానవదేహము ఒక విచిత్రమైనటువంటి, అపూర్వమైనటువంటి యంత్రము. ఈ దేహము ఒక చిన్న ప్రపంచము. ఇలాంటి పవిత్రదేహము ధరించిన మానవుడు ప్రపంచమునకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించలేకపోవటము ఒక విచారకరమైనటువంటి విషయము. దేహమనగా లేక మానవుడనగా కన్నులు, ముక్కు, చెవులు, నోరు, చేతులు, కడుపు, కాళ్ళు మొదలగు సర్వాంగములయొక్క కలయిక స్వరూపమే! ఏ ఒక్క అంగము ప్రత్యేకముగా మానవస్వరూపము కానేరదు. ఇటువంటి మానవత్వముయొక్క దివ్యత్వాన్ని అర్థము చేసుకొని వర్తించటానికి దేహముయొక్క అభివృద్ధిని మనము అత్యవసరముగా కోరాలి, ఆచరించాలి.

**నిరంతరము బ్రహ్మతత్త్వములో మనసు చరింపచేయటమే బ్రహ్మచర్యము**

వినయము, సత్యము, అహింస, ఆస్తేయము, బ్రహ్మచర్యము యీ ఐదు విద్యార్థులకు పంచ ప్రాణములు. పంచప్రాణ స్వరూపమైనటువంటి విద్యార్థి యిందులో యే ఒక్క ప్రాణము సక్రమమైన మార్గములో లేనప్పటికి నిర్జీవిగా మిగిలిపోతాడు. విద్యార్థి, విద్యార్థినులకు బ్రహ్మచర్యము అనేటువంటి పవిత్రమైన మార్గము యీ వయసునందు అత్యవసరము. ఇది కేవలము నైతిక ఆదర్శముపై ఆధారపడివుంటున్నది. మానవునియొక్క జీవితములో విజయములన్నియు తనయొక్క నడతపైననే ఆధారపడివుంటాయి. అందువలన, మానవుడు తన నడతను సక్రమమైనరీతిగా తీర్చిదిద్దుకోవాలి. భౌతిక,



sri sathyasai vahinamrutam

లౌకిక, ధార్మిక, ఆధ్యాత్మిక జీవితాలకు నైతిక జీవితమే వెన్నెముక. బ్రహ్మచర్యమనగా కేవలము గృహస్థ ధర్మములేకుండ వుండటంకాదు. నిరంతరము బ్రహ్మతత్త్వములో తన మనసు చరింపచేయటమే బ్రహ్మచర్యము.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

అదియు పూర్ణము, యిదియు పూర్ణము. పూర్ణమున పూర్ణము ఉదయించును. పూర్ణమునుండి పూర్ణమును తీసిన పూర్ణమే శేషించి యుండును. అనగా పరమాత్ముడు, ప్రకృతి పూర్ణస్వరూపులు. కనుకనే మనము చేయు ప్రతిపనికూడను పూర్ణాకారము ధరించినప్పుడే, పూర్ణతత్త్వాన్ని వహించినప్పుడే యీ పూర్ణత్వమును, పరిపూర్ణమైన ఆనందమును అనుభవించగలము.

**భావ పరిపుష్టికి, సంతుష్టికి శరీరపోషణ అత్యవసరము**

పరిపూర్ణస్వరూపుడైనటువంటి పరతత్త్వాన్ని మనము పొందవలెనన్న మన సర్వకర్మలుకూడను పరిపూర్ణమైనటువంటి స్థితిలోవుండాలి. ఈనాడు మనము యే చిన్న కార్యమునుకూడను పరిపూర్ణవిశ్వాసముతో చేయటంలేదు, పరిపూర్ణ త్యాగముతో మనము ఆచరించటంలేదు. అన్ని క్రియలుకూడను అపరిపూర్ణముగా మనము ఆచరించుతాము. ఈ అపరిపూర్ణమైనటువంటి క్రియలు పరిపూర్ణ స్వరూపుడైన పరమాత్మకు యెట్లా చేరగలవు? ఆరోగ్యమైన దేహమునందే ఆరోగ్యమైన మనసు నిలువగలదు. మనోశరీరములు ఆరోగ్యముగా వుండినప్పుడే సక్రమమైనటువంటి సంకల్పములు అభివృద్ధికాగలవు. మన భావములు పవిత్రమైనవిగా, నిష్కల్మషమైనటువంటివిగా వుండాలనుకున్నప్పుడు శరీరము పుష్టిగాను, మనసు సంతుష్టిగాను వుండాలి. కనుక యీ భావపరిపుష్టికి, సంతుష్టికి మన శరీర పోషణ అత్యవసరము.

ప్రాచీనకాలమునుండి నాగరికదేశమని పేరుగాంచిన రోమనుదేశములో శరీరమును ఎంత అభివృద్ధిగావించుకొని, యెంత ఆరోగ్యవంతముగా చూచుకుంటారో అట్టివారిని గొప్పవారని భావింతురు. నిజమైన ఆస్తి మన ఆరోగ్యమే! విద్యార్థి, విద్యార్థినులకు యీనాడు

sri sathyasai vahanamrutam

పుష్టియైనటువంటి శరీరము, సంతుష్టియైన భావములు ఆత్యవసరము. పూర్వపు మహర్షులందరు పవిత్రమైన చర్యలచేత, పవిత్రమైన దివ్యభావములచేత సత్కీర్తినార్జించి ఆధ్యాత్మిక ప్రభావమును అభివృద్ధి గావించుకున్నారంటే దీనికి మూలకారణము వారి ప్రవర్తనలే!

**నియమములేని జీవితము అనేక దురవస్థలకు గురవుతుంది**

నియమిత జీవితాన్ని మనము అత్యవసరముగా పాటించాలి. జీవితములో నియమమే లేకపోతే అన్నివిధములైనటువంటి అవస్థలకు గురి అవుతుంది. ప్రకృతి అనేక రకములైన నియమములను ఆచరిస్తూ వుంటున్నది. సూర్యోదయము, సూర్యాస్తమయము పురస్కరించుకొని, ఆధారము చేసుకొని తిరిగి ఋతువులవరకు తన నియమములను తాను పాటిస్తూవున్నది. ఈ విషయములో ప్రకృతియే మనకు సరియైనటువంటి ఆదర్శమును నిరూపిస్తూ వుండాది. మానవుడు ఇట్టి నియమములను ఆచరించకుండాపోవటంచేతనే అనేకవిధములైనటువంటి కష్టములకు, నష్టములకు గురిఅవుతున్నాడు.

యీనాటి విద్యార్థులు తమ శ్రేయస్సును ఏమాత్రము చింతించక కేవలము ప్రేయస్సుకు మాత్రమే పరితపిస్తున్నారు. "నశ్రేయో నియమం వినా" అని శాస్త్రము ఘోషిస్తున్నది. నియమము అనేటువంటిది లేకపోవుటచేతనే మానవునికి శ్రేయస్సు తగ్గిపోవుచున్నది. ఈనాడు వినోదార్థమై ఆటపాటలు ప్రారంభమయ్యాయి. కానీ యీ వినోదము క్రమేణా విషాదమునకు కొనిపోవుచున్నది. పూర్వము రోమ్, స్వీడన్, గ్రీస్, చైనా యిలాంటి ప్రాంతములలోపల మొట్టమొదట విలాసముల నిమిత్తమై, విహారనిమిత్తమై వింతలనిమిత్తమై ఈ ఆటలు ప్రారంభమైనాయి. క్రమక్రమేణా అవి విషాదస్థితికి చేరుకున్నాయి. కనుకనే వీటికి 'ఆటలు' అనేటువంటి పేరు పోయి 'జూదము' అనే పేరు వచ్చింది. జూదమనగానేమి? ధనమును, వస్తువులను ఒడ్డి ఆడటంచేత ఇది జూదముగా మారిపోయింది. ఈజిప్ట్, రోమ్, గ్రీస్ లోపల ఈ జూదము పాచికలు, పేకాట, గుఱ్ఱపు పందెములు మొదలగు క్రీడలలో ప్రవేశించి అవి పేరు పొందాయి. పశ్చిమఆఫ్రికాలోపల ఈ ఆటలు ఇంకా మితిమీరిపోయి ఎవరు ఆటలయందు గెలుపొందుదురో వారికి

sri sathyasai vachanamrutam

ఓడినటువంటివాడు తన కుడిచేయి కొట్టియివ్వాలి అని ఒక నియమము చేశారు. క్రమక్రమేణా ఈ వ్యసనము మరింత ముదిరిపోయి చైనా, పశ్చిమ ఆఫ్రికా దేశాలలో భార్యబిడ్డలనుకూడ ఒడ్డి జూదమాడటం ప్రారంభించారు. చైనా దేశము పతనము కావటానికి ఈ జూదములే మూలకారణము. వీటన్నింటికి పరాకాష్టగా 19వ శతాబ్దంలో క్రికెట్టు అనేటువంటి జూదము పెచ్చు పెరిగిపోయింది. ఒక్కొక్క వ్యక్తి ఈ క్రికెట్టు అనేటువంటి జూదములోపల అరవై మిలియను డాలర్సు ఒడ్డేటువంటివారు. ఒక మిలియన్ అంటే పది లక్షలు, అరవై మిలియన్లంటే ఆరునూర్ల డాలర్లు, ఆరు నూర్ల డాలర్లంటే మన భారతదేశంలో విలువ అరవై కోట్లు. ఇదికాక ఫుట్‌బాల్ అనేటువంటి మ్యాచ్‌లోపల మరింత ఎక్కువగా ధనము వ్యయము చేసేటువంటివారు. ఇటీవలికాలములో 1947వ సం॥లో ఇంగ్లాండులో జరిగిన ఒక ఫుట్‌బాల్ మాచ్‌లో గ్రౌండు అంతా కూడాను కరెన్సీ నోట్లు చల్లినారు. ఆవిధముగా వినోదము నిమిత్తమై ఏర్పడినటువంటి ఆటలంతా విషాదకరమైనటువంటి రూపాన్ని ధరించాయి. ఈనాడు ఆటలన్నియు ఒక వ్యాపార రంగముగా మారిపోయాయి. చిన్నచిన్న పిల్లలందరు క్రికెట్, బ్యాడ్‌మింటన్, ఫుట్‌బాల్ యీలాంటి ఆటలంతా నేర్చుకోవడంలో మేముకూడను గొప్ప ప్లేయరుగా తయారైపోయి దండిగ లక్షలు సంపాదించాలి అనేటువంటి లక్ష్యముతో యీ ఆటలలో ప్రవేశిస్తున్నారు. నిజానికి ఈ ఆటలు దేహమును ఆరోగ్యవంతముగాను, మనసును ఆనందవంతముగాను తీర్చిదిద్దుకొనే నిమిత్తమై యేర్పడినటువంటివి. మొట్టమొదట ఈ క్రికెట్టు గేమ్ ఎక్కడ ప్రారంభమైంది? ఇది 1877 లోపల ఆస్ట్రేలియలో మెల్‌బోర్న్ అనే గ్రామములో మ్యాచ్ ప్రారంభమైంది. ఆనాడు దీనియొక్క ఆశయములు వేరుగా వుండేటటువంటివి. ఆనాటి ఆటలయందు ఒక శోభ రాణించేటువంటిది. ఆటల ప్రయోజనాన్ని మాత్రమే లక్ష్యమునందుంచుకొని ఆట ఆడేటటువంటివారు. అదే వారికి నిజమైనటువంటి ఫలము అని భావించెడివారు. అందులో గెలవలేక పోయినప్పటికి తాము జయించినటువంటివారుగా ఆనందించేవారు. అనగా క్రమమును అనుసరించటమే విజయము అనే భావమును కలిగియుండేవారు. యీనాటి ఆటల లక్ష్యము ఎలావుందంటే యెదుటివాడిని ఎలాగైనా ఓడించటమే! ఆటలయొక్క పద్ధతులు, నియమములు తాము

sri sathyasai vachanamrutam

యేవిధముగా వుల్లంఘించినప్పటికి ఫరవాలేదు. మేచ్‌లను వాచ్‌చేసేటువంటి అంపైర్ విజిల్ వూదినా ఎవరూ కేర్ చేయటంలేదు. ఇక్కడకూడా ఒక విధమైన వ్యాపారము ప్రారంభమైంది. ఏదో ఆ వాచ్‌చేసే అంపైర్లకు అంతోయింతో యిస్తే వాళ్ళుకూడా సర్దుకుపోతున్నారు. ఇది నిజమైనటువంటి గేమ్ కాదు. ఈ ఆటలలో పాల్గొనేటువంటివారుకూడను సమఉజ్జీలుగా వుంటుండాలి. మహాభారతయుద్ధ సమయములో ధర్మజుడు కౌరవులను కోరాడు, 'మా ఐదుమందిలో యెవరినైనా సరే మీరు కోరి వాడిని ఓడించారంటే తిరిగి నేను పన్నెండు సంవత్సరములు అరణ్యానికి వెడతాన'న్నాడు. కౌరవులు దుష్టులు, దుర్మార్గులు, దుర్బుద్ధులు కలిగినటువంటివారు అయినప్పటికిని యీయొక్క జూదమునందు కానీ, యింకేవిధమైన ఆటలయందుగానీ నియమాన్ని పాటిస్తూ తమకు సమయోధులుకావాలని విశ్వసించేటువంటివారు. దుర్యోధనునికి ఒక్క గదాయుద్ధము తప్ప అన్యము యేమాత్రము తెలియదు. అతను యే నకులునినో, యే అర్జుననో కోరివుంటే పాండవులు తిరిగి అరణ్యానికి పోవలసివచ్చివుండేది. కానీ ఆవిధముగా కోరలేదు. గదా యుద్ధములో తనకు సమయోధుడైన భీముని మాత్రమే యుద్ధము చేయమన్నాడు. ఈ విధంగా ఆటలపోటీలయందు ఇరు పక్షాలవారు సమయోధులుగా వుంటుండాలి.

ఈనాడు అధికారులుకూడను యీవిధమైనటువంటి విచారణ సల్పటంలేదు. అండర్‌గ్రాడ్యుయేట్ పిల్లలను పోస్టుగ్రాడ్యుయేట్ పిల్లలతో సమంగా ఆడిస్తూవుంటారు. దీనివల్ల ఓడిపోతే వారు ఎంత బాధపడతారో అనేటువంటి విషయముకూడ యీ అధికారులకు యే మాత్రము తెలియదు. కనుకనే పిల్లల్లో నిరాశ, నిస్పృహలు అభివృద్ధి అవుతున్నాయి. దీనికి యెవరు కారణము? అధికారులే! అధికారులకు ఆటలసంగతి తెలియకుండానైనా వుండాలి లేక ఆటలపై శ్రద్ధ అయినా లేకుండా వుండాలి. ఈ రెండు కారణాలు తప్ప మూడవ కారణం యేమాత్రం నమ్మటానికి వీలులేదు. ఇలాంటి అధికారులు అభివృద్ధి కావటంచేతనే విద్యార్థులలోపల విప్లవాలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఆటలపోటీలను చక్కగా ఆర్గనైజ్ చేయాలి. ప్రొఫెసర్లతో ఫిజికల్ డైరెక్టర్సుతో, పిల్లలతో సంప్రదించి యీ ఆటలపోటీలు యేవిధముగా నిర్వహించాలి అనే ఒక ప్లానును వేసి దాని

sri sathyasai vachanamrutam

ప్రకారం యీ ఆటలు ఆడించటానికి ప్రయత్నం చెయ్యాలి. ఏవిధమైనటువంటి ప్లాను లేకుండా ఆటలు ఆడించటమంటే యిది కేవలము హాస్యాస్పదమైనటువంటి విషయము. ఎవ్వరితోనూ సంప్రదించటం లేదు. దీనికి ఒక కమిటీ అనేటువంటిది లేదు. ఒక కమిటీనే లేనప్పుడు ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్స్ ఒకరో యిద్దరో యేరీతిగా చూచుకోగలరు? ముఖ్యముగా దీనిలో శ్రద్ధ తక్కువైంది. ఒకరిపైన ఒకరికి విశ్వాసము క్షీణించిపోయింది. యిది సరియైనటువంటిది కాదు. దీనివలన భవిష్యత్తులో అనేకమైనటువంటి బాధలను యెదుర్కోవలసివస్తుంది.

**విద్యతోబాటు కామన్‌సెన్స్, జనరల్ నాలెడ్జ్ అత్యవసరము**

చదువుకు, సంస్కారానికి చాలా భేదము వుంది. చదువు కేవలము గ్రంథపరిచయయము కావచ్చును. తెలివితేటలను పెంచవచ్చును. కానీ, కామన్ సెన్స్, జనరల్ నాలెడ్జ్ వీటిని అభివృద్ధిపరచటానికి ఉపయోగపడదు. ఎడ్యుకేషన్‌తోపాటు కామన్‌సెన్స్, జనరల్ నాలెడ్జ్ అత్యవసరము. నిజముగా మన ఇన్‌స్టిట్యూట్‌లో చూస్తే అందరు భక్తులే! వైస్ చాన్స్‌లర్ భక్తుడు, రిజిస్ట్రార్ భక్తుడు, కంట్రోలర్ భక్తుడు. ఇంక, యీ ప్రొఫెసర్స్ అంతా భక్తులు. ట్రెజరర్ భక్తుడు. విద్యార్థులున్నారు, వారు పరమభక్తులు. అయితే అందరూ భక్తులే కానీ యీలోపం జరగటంలో యెక్కడ వుంది కారణం? పూర్వము పల్లెలలో అనేటువంటివారు; 'బజారంతా బ్రాహ్మణులే! కానీ, మా కోడిపెట్ట కనుపించటంలేద'నేవారు. యీ కోడిపెట్ట తినే బ్రాహ్మణులు యెవరో యిందులో వుంటున్నారు. లేకపోతే, యీ కోడిపెట్ట పోవడానికి యే కారణము లేదు. అదేవిధంగా యీనాడు మన ఇన్‌స్టిట్యూట్‌లోపల యీ విధమైనటువంటి లోపము జరుగుతుందంటే యెక్కడవుంది కారణం? దీని కీలకాన్ని గుర్తిస్తే మనలో యూనిటీ లేకపోవటమే దీనికి మూలకారణము. ఈ యూనిటీ వుంటే వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్, కంట్రోలర్, ప్రొఫెసర్స్ అందరూ చేరి ఒకరితో ఒకరు సంప్రదించి కార్యాలుచేస్తే యెంత ఆనందంగా జరిగేటువంటిది! కలయికే లేదు, ఎవరి పని వారిది. బావిలోని కప్పలవలె ఎవరి పనులు వారు చేసుకుంటూ పోతారు. ఈ విశాల ప్రపంచము మన ఇన్‌స్టిట్యూట్‌ను సహస్రాది

srisathyasaivachanamrutam

నేత్రములతో చూస్తున్నది అనేటువంటి విచారణ వారు చేయటంలేదు. స్వామి పిల్లల స్పోర్ట్‌కు రాలేదే, చూడటానికి రాలేదే అని మాత్రం విచారం చేస్తారు. నేను ఒక్కడనే కాదు. నేను వచ్చినానా, ప్రశాంతి నిలయములో వుండినటువంటి అన్ని దేశముల భక్తులు నాతోబాటు అక్కడ ప్రవేశిస్తారు. వారందరూ మన పిల్లలు ఆడే ఆటలు చూస్తే చాలా హాస్యాస్పదముగా వుంటుంది. ఏవిధమైనటువంటి మేనేజ్‌మెంట్ లేకుండా ఆటలు ఆర్గనైజ్ చేయటంచేత వీటిని చూచి మీ ఇన్‌స్టిట్యూట్ గౌరవముకూడను పోతుంది. ఆ గౌరవమును కాపాడే నిమిత్తము నేను రాకుండా వుండినాను. ఇన్‌స్టిట్యూట్‌యొక్క గౌరవము కొంతమందికి లేకుండా పోవచ్చును. కానీ, నాకు లేకుండా వుంటుందా? ఇది శాశ్వతముగా వుండేటువంటిది. కనుక, ఆ గౌరవాన్ని కాపాడుకొనే నిమిత్తము నేను యిక్కడకు రాలేకపోయినాను. ఉన్నది మూడు కాలేజీలే! మూడు కాలేజీలనే ముచ్చటగా చూసుకోలేకుండా పోతే, ఇంక మున్నూరు వుండినటువంటి కాలేజీలను మీరు యేరీతిగా మెయిన్‌టైన్ చెయ్యగలరు? నేను ఆనందముగా వచ్చి దీనికి ప్రారంభోత్సవము చేశాను. ప్రథమములో ప్రైమరీ స్కూలు పిల్లలు వచ్చినారు. వారు నడుస్తూంటే సిపాయిలు నడుస్తూ వచ్చినట్టు ఉంది. ఆ దృశ్యము చూచేటప్పటికి యెంతో ఆనందం వేసింది. క్రమక్రమేణా ఆ ఆనందము తరుగుతూ పోయింది. కానీ, పిల్లల సంఖ్య మాత్రం పెరుగుతూ వచ్చింది. కట్టకడపటికి మన ఇన్‌స్టిట్యూట్ పిల్లలు వచ్చేశారు. వారిని చూచి తల వంచుకోవలసి వచ్చింది. కారణం యేమిటి? వాళ్ళకు మార్చింగు కూడా తెలియదు. కేవలము వృద్ధులైనటువంటివారు నడచినట్టుగా నడుస్తున్నారు. పుండ్లు వుండినటువంటివాళ్ళలా నడుస్తున్నారు. అలాంటి దృశ్యము నిజముగా మనము చూడవలసినదేనా! అనంతపురం కాలేజిలోపల అందరూ ఆడవారే! అయినా వాళ్ళు యెంత బాగా ఆర్గనైజు చేశారు! నాకందరూ సమానులే! నిజము చెప్పాలంటే ఆడవారిలో ఐకమత్యము తక్కువ. అలాంటి స్వభావము కలిగినటువంటివారైనాకూడను అందరు టీచర్లు కలసి మెలసి ఆర్గనైజ్ చేయటంలో యెంత బాగా రాణించాయి, వాళ్ళ దృశ్యములు! ఒక్కొక్కరు ఒక్కొక్క భాగాన్ని తీసుకున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క బాధ్యతను తీసుకున్నారు. వారి ప్రదర్శన అందరిని ఆశ్చర్యచకితులను గావించింది. అందరి హృదయాలను ఆకర్షించింది. అందరికి

sri sathyasai vahanamrutam

ఆనందము ఉప్పొంగిపోయింది. వాళ్లు చేసిన ప్రతి ఒక్క విన్యాసము ఒకదానికంటె ఒకటి మించి పోయినట్టుగా ఆనందాన్ని అందించారు. ఆ మాత్రము యూనిటీ మన ఇన్స్టిట్యూట్‌లో లేకపోయిందా? దీనికి అధికారులు ఏమి చేస్తున్నారు? ఎందుకోసం వీళ్ళకు అధికారము యిచ్చాను? వీరు చేసే పనియేమిటి? 'బుర్' అని భజనటైమ్‌లో రావటం, 'సర్' అని పైకి వెళ్ళిపోవటం! ఇదేనా వీరు చేయవలసినటువంటి పని?

**టీచర్లు ఆటల విషయాలలోనేకాక, టీచింగులోకూడా చాలా శ్రద్ధ వహించాలి**

"పిల్లలయొక్క పరిస్థితి యేరీతిగా వుంది, వీరిని యేవిధముగా ఆదర్శ వంతముగా తీర్చిదిద్దాలి, యీ ప్రొఫెసర్‌కు పిల్లలకు వుండవలసినటువంటి సన్నిహిత సంబంధబాంధవ్యమేమిటి, మనము వీళ్ళను ఏరీతిగా తీర్చి దిద్దాలి" అనేటువంటి ఆలోచనే వీళ్ళలో లేదు. పిల్లలకు ప్రొఫెసర్స్‌పైన విశ్వాసము పోయింది. ప్రొఫెసర్స్‌కు పిల్లలపైన నమ్మకము పోయింది. ఈవిధముగా ఒకరితో ఒకరికి యేవిధమైన సంబంధము లేకుండాపోతే యీ ఇన్స్టిట్యూట్ యే విధముగా నడపటానికి వీలవుతుంది? ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యతనిచ్చి రిజిస్ట్రారుకు రిజిస్ట్రారుపని, ఒక్కొక్క ప్రొఫెసర్‌కు ఆ సబ్జెక్టును గురించి, ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్స్ వాళ్ళకు సంబంధించినది వాళ్ళకు, యీ విధముగా కొన్ని కమిటీల ప్రకారము నిర్ణయము చేస్తే యెంతహాయిగా జరుగుతుంది! కేవలం ఒక్క ఆటలవిషయంలోనే కాదు, టీచింగులోకూడా మీరు చాలా శ్రద్ధ వహించాలి.

**వియ్యానికైనా, కయ్యానికైనా సమ ఉజ్జీలు ఉండాలి**

ఇప్పుడు వైట్‌ఫీల్డుగురించి తీసుకుందాం. వైట్‌ఫీల్డ్‌లో ఫిజికల్ డైరెక్టరు లేడు. పిల్లలు, పాపం వారికి వారే అవస్థపడి వారిలో వారే ఒకరికొకరు సరిదిద్దుకొని యీ ఆటల పోటీలకు వచ్చారు. ఇలాంటి పోటీలు పెట్టటమంటే మనకు యే విధముగా మనసు వస్తుంది? అందులోను అండర్ గ్రాడ్యుయేట్ పిల్లలే వైట్ ఫీల్డ్‌లో వుండేది. ఆ పిల్లలను తెచ్చి పోస్ట్‌గ్రాడ్యుయేట్ వాళ్ళతో పోటీపెట్టారు. ఎందుకోసం యింత మాత్రం యోచన చేయలేకుండా పోయారు? ఆ పిల్లలు ఓడిపోతే నాకెంత బాధవస్తుంది? కేవలము మన ప్రశాంతి నిలయము పిల్లలు 'గెల్చారు, గెల్చారు', అనుకోవటం అవమానము. చిన్న

sri sathyasai vachanamrutam

పిల్లలతో ఆడి పెద్ద పిల్లలు గెల్చుటమనేటువంటిది చాలా అవమానకరమైనటువంటి విషయము. ఒకానొక సమయములో అర్జునుని ప్రమీల పిల్చి "అర్జునా! నీవు నాతో యుద్ధముచేసి నన్ను జయించు. నీవు తరువాత కావలిస్తే వెళ్ళు" అంది. అర్జునునికి అక్కడ ధర్మసంకటమైనది, ప్రమీలతో గెల్చినా ఆడవాళ్లతో గెల్చటం ఏమి గొప్ప? ప్రమీలతో ఓడిపోతే ఆడవాళ్ళతో ఓడిపోయాడు అనుకుంటారు. 'ఈ సమయములో నేను ప్రమీలతో యుద్ధము చేయటమా? మానటమా?' అనుకున్నాడు. అనాదికాలమునుండి వియ్యానికైనా, కయ్యానికైనా సమ ఉజ్జీలుండాలనే యిన్ని విధములుగా విచారణ చేస్తూ వచ్చింది, మన భారతదేశము. కనుక, యీవిధముగా పిల్లలయొక్క పరిస్థితిని మనము చక్కగా గుర్తించి, వర్తింపచెయ్యాలి. ఈ ఆర్గనైజింగు యేమాత్రము సక్రమముగా లేదు.

మరొక చిన్న విషయము: కొంతమంది పిల్లలు ఆడుతున్నారు. ఆటలను చూచేటువంటివారు బాగా ఉత్సాహముగావుంటే ఆడే పిల్లలకు మరింత వుత్సాహముగా వుంటుంది. కానీ ఈ పిల్లల ఆటలను చూచేటువంటివారే లేరు. మన ఇన్‌స్టిట్యూట్ పిల్లలందరుకూడను మందిరంలో వచ్చి కూర్చుంటారు. ఇంక ఆడేపిల్లలకు యేరీతిగా వుత్సాహము అభివృద్ధి అవుతుంది? ఆటల సమయములో పిల్లలు అందరు ఫీల్డులో వుండే తీరాలి అనే నియమము యెందుకు చెప్పకూడదు? ఎంతమంది ప్రశాంతి నిలయము కాంపస్‌లో వుండేటువంటి పిల్లలు యీయొక్క గేమ్స్‌లో పాల్గొన్నారు? ఎనభై పర్సెంటుకూడా పాల్గొనలేదు. దీనిని యెవరు గమనించారు? ఎవరికోసము ఈ ఆటలు పెట్టాము? ఎందుకోసము ఆటలు పెట్టాము? ఇది గమనించకుండాపోతే యీ అధికారులు ఉండి యేమి ప్రయోజనము? ఇలాంటి విషయములవల్ల నాకు చాలా బాధ కలుగుంది.

**లౌకిక విద్యలతోబాటు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విద్యలను సమన్వయం చేసి బోధించటమే సత్యసాయి విద్యావిధానము**

ప్రపంచములో యెన్ని వేల కాలేజీలో వుంటున్నాయి. మనం కాలేజి స్థాపించటంలో వున్నటువంటి అంతరార్థమేమిటి? పవిత్రమైనటువంటి నైతిక ఆదర్శమును నిరూపించాలి. దివ్యమైన భావములు విద్యార్థులలో ప్రవేశపెట్టాలి. ఐకమత్యమనేటువంటి విశాలభావాన్ని



sri sathyasaivachanamrutam

పెంచాలి. పవిత్రమైన ఆధ్యాత్మిక దృష్టి పిల్లలకు కలిగించాలి. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గములందు లౌకికాన్నికూడ నిరూపించి విద్యార్థులను యీ విధమైనటువంటి ఆదర్శప్రాయులుగా దేశానికి అందించాలనేటువంటి వుద్దేశ్యమే మాది. అలాంటి సందర్భములో సమయములో యితర కాలేజీలకు, మన కాలేజీలకు పోలిక చేయటము యేమాత్రము సరికాదు. మనకు యే పోలికలు వద్దు. మనదాన్ని మనము అనుభవిస్తాము. ఈవిధమైన మార్గాన్ని మనము కించిత్తుకూడా యోచించకుండా మన ఇష్టం వచ్చినట్లు చేసినప్పుడు సంవత్సరానికి ఒక్కతూరి జరిగేటువంటి యీ ఆటలవల్ల ఏమి ప్రయోజనము? పూర్వకాలములో కాలేజీలో ఆటలపోటీలంటే అబ్బో ఎంత ఆనందమును అనుభవించేటువంటివారు! ఎంత ఉల్లాసమును అనుభవించేటువంటి వారు! ఈ పిల్లలను చూస్తే ఆ ఆనందము వాళ్ళముఖాలలో కించిత్తు అయినా కనుపించటంలేదు. వారికి ఉత్సాహప్రోత్సాహములను అందించేవారు ఎవరూ లేరు. ఇలాంటి పరిస్థితిలో స్వామికి ఆనందము, ఆనందము అంటే యెట్లా వస్తుంది? మొదటినుండికూడ నేను చెబుతున్నాను, 'నా ప్రాపర్టీ అంతా పిల్లలేనని'. పిల్లలలో ఆనందములేకపోతే నాకు యేమి ఆనందము? ఎన్ని విధములుగా ఖర్చుపెట్టి వాళ్ళకు ఆటలకు కావలసిన సామానులు తెప్పించాను! అయినప్పటికి పిల్లలలో ఈవిధమైనటువంటి నిరుత్సాహానికి మూలకారణ మెవ్వరు? ప్రొఫెసర్స్, లెక్చరర్స్, అధికారులు వీరే మూలకారణము. అధికారులకు అర్థముకాకపోతే, ప్రొఫెసర్స్ అయినా చెప్పాలి. 'ఈ ఫిజికల్ ఇన్స్ట్రక్టర్స్ ఏవిధముగా పనిచేస్తున్నారు? పిల్లలకు అవసరమైనటువంటివి యేరీతిగా నేర్పుతున్నారు?' అనేటువంటిది యెవ్వరూ విచారణ చెయ్యటంలేదు. వాళ్ళు మాత్రం యేమి చేయగలరు? అధికారులేమైనా పిల్చి 'యిదిచేయి, అదిచేయి,' అంటే వారు దానిని ఆచరించడానికి సంసిద్ధముగా ఉంటారు.

**'నాకొరకు ఎవరూ రాలేదు, మీకోసం మీరు వచ్చారు!'**

ఆటలయందే కాదు, టీచింగ్‌యందుకూడను ఒక ప్రత్యేకమైనటువంటి విధానము ప్రారంభించాలి. ఏదో ఒక సబ్జెక్టుని ప్రిపేరు అయివచ్చి క్లాసులో మాట్లాడి వెళ్ళిపోతే ప్రయోజనం లేదు. "పిల్లలు యీ వాతావరణానికి యేరీతిగా సరిపోతున్నారు, వాళ్ళు యే

srisatyasaivachanamrutam

సబ్జెక్టులో బలహీనంగా వున్నారు, ఏ దాంట్లో నిరుత్సాహపడుతున్నారు, దేనిలో అర్థముకాకుండా తపిస్తున్నారు", అని వారిని అప్పుడప్పుడు కలసి వారి డౌట్స్ అంతా క్లియర్ చెయ్యాలి. అప్పుడప్పుడు క్లాసులోనే స్లిప్ టెస్ట్లు పెట్టాలి. ఇంతేకాకుండా ఆ క్లాసుకు సంబంధించిన టీచర్సు అంతా చేరి అక్కడ 'వైవా' అనేటువంటిది వారానికొకసారి జరపాలి. ఆ తరువాత వారి నోట్సు ప్రిపరేషన్ యెట్లావుంది, యేమిటని వాళ్ళను గమనించాలి. క్విజ్ పోటీలు పెట్టాలి. ఇంకా హోమ్‌వర్క్ ఇవ్వాలి. ఇలాంటివన్నీ వాళ్ళకు కాలము వ్యర్థము కాకుండా తర్ఫీదు ఇస్తూ వస్తే పిల్లలు ఎంత అభివృద్ధికి రారు! ఈనాడు ఈ హోమ్ అస్సైన్‌మెంట్ అనేది ఏమాత్రము ఇవ్వటము లేదు. హాస్టలు పిల్లలే కాలేజి పిల్లలు; కాలేజి పిల్లలే హాస్టలు పిల్లలు. హాస్టల్‌లో వార్డన్, కాలేజిలో అధికారులు చక్కగా వారిని గమనిస్తే, వారికి ఆదర్శంగా ఉంటూంటే పిల్లలు చెడిపోవటానికి ఏ మాత్రము అవకాశము లేదు. వీరికి తగిన వుత్సాహ, ప్రోత్సాహములు ఎవరూ కల్పించటము లేదు. కనుకనే పిల్లలలో ఉత్సాహము దినదినమునకు దిగజారిపోతున్నది. పిల్లలకు కొన్ని కొన్ని సబ్జెక్టు ఏమాత్రము అర్థము కాకుండా వుంటే, పాపం వాళ్ళు నాకు జాబులు రాస్తుంటారు. నేను చెబుతుంటాను, "మీ ప్రొఫెసర్స్‌ను అడిగి దానికి తగిన సందేహనివారణ చేసుకోండ"ని. అందరూ భక్తులు, భక్తులమని ఇక్కడకు వస్తుంటారు. "స్వామీ! మేము మీకోసమే వచ్చియుండేది", అని విద్యార్థులు చెప్పుతారు, ఉపాధ్యాయులు చెప్పుతారు. ఇది కేవలం స్టంట్, నా కోసం ఎవరూ రాలేదు. మీకోసం మీరు వచ్చారు. ప్రతి విద్యార్థి 'ఐ హ్యావ్ కమ్ ఫర్ యు', 'ఐ హ్యావ్ కమ్ ఫర్ యు' అని చెపుతూ ఉంటారు. ఈ రకంగా మాటలు నేర్చితే ప్రయోజనము లేదు.

**పాటలు పాడిన ఫలమేమి? మంచి మాటలు నేర్చిన మహిమేమి**
**సూటిగ సాయిబాటలో నడచిన సుఖమను మూటలు దొరుకునుగా**
**ఇహపరసుఖమను మూటలు దొరకునుగా**

మాటలు, మాటలు యీ మాటలలో, ఈ యొక్క వ్రాతలలో చూస్తే చాలా వున్నత స్థాయిలో ఉన్నట్లు కనుపిస్తారు. కానీ హృదయ బాటలో చూస్తే అంతా చీకటే!

srisathyasaivachanamrutam

నిజముగా స్వామికోసము వచ్చినటువంటివారైతే పిల్లలయొక్క పరిస్థితి, వారుపడే ఇక్కట్లు, బాధలు వీరెందుకు గమనించకూడదు? ఇంకా యీ బయోసైన్స్ డిపార్టుమెంటు మరీ అధ్వాన్నం. చీకటి గదిలో కూర్చొని కప్పలు, చేపలు, పాములు కోస్తూ ఆకంపులోనే వీరు మునిగిపోతున్నారు. వీరికి సరియైన గైడెన్స్ ఇచ్చేటటువంటివారు కాని, ఈ వాతావరణమునకు తగినట్లుగా ఆ పిల్లలను మార్చటముగాని వీరు ఏమాత్రము చెయ్యటంలేదు. కేవలము వారికి డిగ్రీలు రావాలి. ఉద్యోగము చిక్కాలి. నిజానికి ఈ డిగ్రీనా మనకు కావలసినది? ఈ బెగ్గింగ్ బౌల్ తీసుకొనిపోయి ఆఫీసు ఆఫీసుకు పోయి 'సార్ నాకు ఉద్యోగము, ఉద్యోగము', అని బెగ్గర్స్‌గా తయారుచేయటానికా మేము ఈ ఇన్స్టిట్యూట్ ప్రారంభించినది? పిల్లలు వాళ్ళ స్వశక్తిపైన వాళ్ళు ఆధారపడాలి. వాళ్ళకాళ్ళపైన వాళ్లు నిలచాలి. చదువు జీవితానికి అని భావించాలి గాని, జీవిత ఉపయోగమునకు అని భావించటానికి కాదు. ఇలాంటి సత్యాన్ని వాళ్ళు గుర్తింపచేయాలి. ఈ విద్యార్థులతో తెల్లవారిమొదలు సాయంత్రమువరకు కలసిమెలసి వుండినప్పుడే టీచర్లకు వాళ్ళ పరిస్థితిని చక్కగా అర్థము చేసుకోవటానికి వీలవుతుంది. ఈనాడు టీచర్లకు ఏ ఒక్కపిల్లలపైన కంట్రోలు ఉండటంలేదు. ఎవరిపాటున వాళ్ళు ఉంటున్నారు. ఈవిధముగా ఉంటుంటే ఈ ఇన్స్టిట్యూట్‌కు యే మాత్రము ఉపయోగము లేదు. దీనికి యేవైనా సరియైనటువంటి కట్టుదిట్టములు చేసినప్పుడే ఇది సరైనటువంటి స్థితికి రాగలదు. ఎంతకాలమునుండో ఈ విషయాలని నా మనసులో పెట్టుకున్నాను. కాని, ఇప్పుడు చెప్పినాను. టీచర్లను విడివిడిగా పిల్చేసి వంద పర్యాయములు చెప్పినాను. అయినప్పటికి వారిలో యేమాత్రము మార్పులేకపోవటముచేతనే ఈనాడు బహిరంగముగా చెప్పవలసి వచ్చినది. ఆశ్చర్యమేమంటే ఎవరి మటుకు వారు ఇందులో మా దోషము ఏమీ లేదని భావిస్తున్నారు. యేదోషము లేకపోతే ఈ వాసన ఎందుకు వస్తుంది? ఇక్కడకు అరవై మైళ్ళువుంటున్నది, అనంతపురము. ఏ అధికారి అయినా అక్కడ క్యాంపు వేసి వారి పరిస్థితులు ఏమిటని విచారించారా? ఏ ఒక్కటి కావలసినా ఫోన్? ఆడపిల్లలు రావటం వీళ్ళదగ్గర మొరపెట్టుకోవటం తిరిగి వారు వచ్చినదారిన వెళ్లటం, ఇదా మనము చేయవలసినటువంటి అధికారము? మీరు యెందుకు అక్కడికి వెళ్ళి స్వయముగా పరిస్థితులు గమనించి ప్రాబ్లమ్స్

sri sathyasai vahini amrutam

పరిష్కరించకూడదు? మూడు రోజులకొకతూరి వాళ్ళు వ్యానులు చేసుకొని రావటం, ఇది న్యాయమా మీకు? కాదు, కాదు. మనపాటికి మనము ఏదో రూములో కూర్చుని మన పని మనము చేస్తున్నామనుకోవటము కాదు. పిల్లలయొక్క పరిస్థితులనుకూడ గమనించాలి.

**శ్రద్ధవుంటే ఎన్నైనా చేయవచ్చు!**

హాస్టల్ పరిస్థితి యెట్లా వుందని కొంతవరకు మీరు గమనించాలి. ఏదో అంతఃపురములో రాణీమాదిరి తన రూములో తను కూర్చొని పిల్లలతో మాట్లాడుతూవుంటే ప్రయోజనము లేదు. ప్రతి రూముకు వెళ్ళాలి. ప్రతి పిల్లవానియొక్క ప్రాబ్లమ్స్ గుర్తించాలి. వారు ఏవిధమైనటువంటి ప్రవర్తనలో వుంటున్నారు గమనించాలి. తమ తమ కర్తవ్యాలు ఎవరూ సక్రమముగా నిర్వర్తించటము లేదు. ఈవిధముగా వుంటున్నప్పుడు యీ ఇన్‌స్టిట్యూట్‌యొక్క ఆశయములు ఏవిధముగా అభివృద్ధికావించగలము? ఆడవారు చేసినటువంటి మేనేజ్‌మెంట్‌కూడా మగవారు చేయలేకపోతున్నారే! ప్రక్కనే వుంటున్నది ప్రైమరీ స్కూలు. దానిలో ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్ అనేటువంటివారే లేరు. ఈ మగ పిల్లలతో, ఆడపిల్లలతో వారు ఎంతబాగా పనిచేయిస్తున్నారు! దీనికంతటికి మూలకారణము శ్రద్ధ, శ్రద్ధ. శ్రద్ధవుంటే ఎన్నైనా మనము చేయవచ్చును. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" అన్ని జ్ఞానములు మనకు ఆవర్భవిస్తాయి.

**చదువెందులకని సంగతిమఱచి**
**ఉదరపోషణకై ఉరుకులెత్తుచు**
**ఎదుటిగొప్ప సహియింపకేడ్చుచు**
**సతమతమయ్యే చదువుల బొమ్మా**
**<u>తైతై</u> <u>తైతై</u> <u>తై</u> బొమ్మా**

ఇలాంటి చదువా మనకు కావలసినది? విశాలభావాన్ని పెంచుకోవాలి. విశాల హృదయములో ప్రవేశించాలి. ఐకమత్యముతో చేయి కలపాలి. ఆదర్శమును లోకానికి చూపాలి. ప్రేమతత్వాన్ని ప్రధానమైన లక్ష్యముగా పెట్టుకోవాలి.

ఒక్కొక్కదానికి ఒక్కొక్క కమిటీని నిర్ణయము చెయ్యాలి. ఒక సెలెక్షన్ కమిటీ వేసుకుని

srisathyasaivachanamrutam

దానికి సరియైనటువంటివారిని పెట్టుకోవాలి. బయటనుండి వచ్చేటువంటి ప్రొఫెసర్స్‌కు, మన ప్రొఫెసర్స్‌కు సన్నిహిత సంబంధ బాంధవ్యమును చేర్చాలి. యేదో వచ్చిన ప్రొఫెసర్స్ వాళ్ళపాటికి వాళ్ళు తమ పనిపూర్తి చేసుకుని వెడుతుంటే వారికి, యీ ప్రొఫెసర్స్‌కు వుండిన వ్యత్యాసము మనము అర్థము చేసుకోవాలి. ప్రతియొక్కరము ఈ ప్రొఫెసర్స్‌ను మీట్ అయి వారితో ఒక కమిటీ ఏర్పాటుచేసి, వారి సమస్యలేమిటి? వారికి, పిల్లలకు మధ్య వున్నటువంటి సంబంధము ఏరీతిగా వుంది? అని తెలుసుకోవాలి. అంతేకాక, ఒక్కొక్కప్పుడు చెప్పకుండా చేయకుండా ఒక్కొక్కక్లాసులోనికి వీరు పోయి చూడాలి, యేవిధముగా పాఠాలు చెబుతున్నారో అని. ఈ ఇన్స్టిట్యూట్‌లో ఏమి తక్కువగా వుంది? ప్రారంభమె కేవలము నాలుగు సంవత్సరములే అయినప్పటికిని, యెంత గొప్ప భవనములు కట్టించాము! ప్రతి విషయములోనుకూడ ఎన్నో అనుకూలములు చేశాము. గవర్నమెంటు స్కేలు ప్రకారము జీతాలు యిస్తున్నాము, తగినటువంటి యింక్రిమెంట్లు యిస్తున్నాము. ఏమి తక్కువచేశాము, టీచర్లకు? దానికి తగినట్లుగా వాళ్ళు యెందుకు నడచుకో కూడదు? లేదు. దానికి తగినటువంటి క్రియలు జరపటంలేదు. కనుకనే నేను యేక్లాసులోనికి ప్రవేశించాలన్నా యెక్కడికి రావాలన్నా నాకు తగినంత ఉత్సాహము, ఆనందము చిక్కటంలేదు. అయితే, నేను యెప్పుడూ ఆనంద స్వరూపుడనే! కాని, మీ నుంచి ఆనందము నాకు రావటంలేదు. ఒక సంస్థను స్థాపించిన తర్వాత దాని స్థితిగతులు గమనించవలసిన బాధ్యత నాకు వుంది. కనుకనే దీనికి కొన్ని విధములైనటువంటి బాధ్యతలుకూడ తీసుకోవాల్సి వచ్చింది. పిల్లలకు తగినంత ఉత్సాహములేదు. నేను ఒంటరిగా వారిని పిలిచి అడుగుతున్నాను. ప్రొఫెసర్స్‌ను, అధికారులను చూచి వారు భయపడవచ్చును కానీ, స్వామి దగ్గర ఓపెన్‌గా చెప్తూ వుంటారు, పాపం! స్వామిదగ్గర చెప్పుకోవటానికి వారికి ఏమాత్రము భయము, సంకోచము ఉండదు. అందువలన వారియొక్క కష్టాలు, నష్టాలు స్వామి దగ్గర చెప్పుకుంటారు. మన పిల్లలదగ్గరనుంచి యీవిధమైన కంప్లయింట్స్ రాకూడదు. మనము ఒక్క నయాపైసా వారి దగ్గరనుండి ఫీజు తీసుకోవటంలేదు. మెడికల్ ఫీజుగాని, గేమ్స్‌ఫీజుగాని, లైబ్రరీఫీజుగాని, లేబరేటరీ ఫీజుగానీ, ఎగ్జామ్ ఫీజుగాని లేదు. ఇలాంటి పరిస్థితులలో వారు యీవిధముగా నిరుత్సాహము పడటము సరియైనటువంటి

sri sathyasai vachanamrutam

పద్ధతికాదు. ఇంకముందుకైనాకూడ యిలాంటి అవస్థలకు గానీ యిలాంటి కంప్లయింట్స్ గానీ రాకుండా చూచుకోవటానికి అందరూ తగిన కృషి చెయ్యాలి.

ఈ ఆటలపోటీలకు మూడు కాంపస్‌ల పిల్లలందరూ వచ్చారు. కానీ ఆ వచ్చినవారికి యేవైనా అరేంజ్‌మెంట్స్ చేశారా? యేమీ లేదు. అన్నీ మందిరంలో కూర్చుని నేను చేశాను. స్కేటింగ్ జరుగుతున్నది, ఆడపిల్లల దగ్గర అంటే మేము వచ్చి యెక్కడ కూర్చోవాలి? కనుక, నేనే చిరంజీవిరావుతో చెప్పి ఒక షామియానా తెప్పించి అక్కడ వేయించి, నాలుగు కుర్చీలు వేయండి అని చెప్పాను. అధికారులు ఈ విషయంలో యేమి చేసారు? నిజంగా యిది పూర్తిగా అధికారుల లోపమే! వైస్-ఛాన్సలర్ తన పనినంతా క్రమక్రమేణా తగ్గించుకొని అన్ని విషయాలను జాగ్రత్తగా చెక్ చేసుకుంటూ ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యతను వప్పగించి తాను ఫ్రీగా అన్నింటిని చూసుకుంటూరావాలి. ఆ పనిచేసినప్పుడే యిది బాగుపడుతుంది. అన్నీ తన కంట్రోల్‌లో పెట్టుకుంటే యేపని జరుగదు. రిజిస్ట్రారుకు ఇవ్వవలసినటువంటి పని రిజిస్ట్రారుకు యివ్వాలి. కంట్రోలర్‌కు యివ్వవలసిన పని కంట్రోలర్‌కు యివ్వాలి. ట్రెజరర్‌కు ఇవ్వవలసినపని ట్రెజరర్‌కు యివ్వాలి. డైరెక్టరుకు ఇవ్వవలసిన పని డైరెక్టరుకు ఇవ్వాలి. డైరక్టర్ అక్కడ యేమి చేస్తాడు పాపం? ఏమీలేదు, ఉప్పులేని పప్పు మాదిరి వున్నాడు! ముందుముందు ఈ విషయాలు చూసుకునేందుకు ఒక కమిటీని స్థాపించి ఒక్కొక్కదానికి ఒక్కొక్క కమిటీ పెట్టి ఆకమిటీతో కన్‌సల్ట్‌చేసి అన్ని విధములా కొంచెము ఎక్స్‌ప్లైన్ చేసుకుంటూ రావాలి.

ఇదేవిధముగా హాస్టల్‌లోకూడను కొన్ని యేర్పాట్లు జరగాలి. ప్రతి విషయములోను పిల్లలయొక్క పరిస్థితిని స్వయముగా వెళ్ళి చూచుకుంటూ రావాలి. కానీ అక్కడకూడను యీ శ్రద్ధాభక్తులు యేమాత్రము కనిపించటంలేదు. వార్డెన్‌చెప్పిన ప్రతిదానికి 'అవును', 'అవును' అని బుర్రవూపుతూ కాలం గడిపేసే శిష్యులుకూడా వుంటున్నారు, అక్కడ. అట్లా చెప్తే ప్రయోజనములేదు. 'సార్! ఇది తప్పు, ఇది సరైనది కాదు, యీవిధంగా చెయ్యాలి అని చెప్పగలిగిన వారు లేరు. చాలా మంది పిల్లలు లెటర్స్ వ్రాసి, స్వామికి ఇస్తుంటారు: "స్వామీ! మేము మందిరానికి వచ్చి అక్కడ ఉంటాము. మాకు హాస్టలులో సరిగా లేదు", అని

srisathyasaivachanamrutam

వ్రాస్తుంటారు. రోజుకు పది, పదిహేను లెటర్స్ వస్తుంటాయి. ఈ పరిస్థితికి ఏదో సర్దిచెప్పి స్వామికి ఎక్స్‌ప్లైన్ చేసేందుకు సిద్ధంగా వుంటున్నారు, వార్డెన్సు, టీచర్లుకూడా! పైగా "పొద్దున, సాయంకాలం స్వామిని చూడటంకోసం ఇక్కడకు వస్తామని చెప్పడానికి ఆ విధంగా అంటున్నార"ని సర్దుబాటు చెయ్యబోతారు. అది కాదు, లోపల కారణము. వీరెవరికి తెలియటంలేదు. అక్కడ సరియైనటువంటి మేనేజిమెంటు జరగటంలేదు. ఒక చిన్న ఉదాహరణము: ఎన్.డి.ఏ. ఎగ్జామినేషన్స్‌కి ఐదుమంది పిల్లలు పోతున్నారు. వీరుపోతుంటే స్వామికి చెప్పవలసిన అవసరము లేదా? అక్కడనుండే ఆర్డరు వేసి పంపించేశారు. స్వామికి, వారికి వుండినటువంటి సంబంధబాంధవ్యాన్ని దూరము చేస్తున్నారు వీళ్ళంతా. కాలేజిలో ప్రొఫెసర్స్ పర్మిషన్ ఇస్తున్నారు. హాస్టల్‌లో వార్డెన్ పర్మిషన్ ఇస్తున్నారు. ఇంక నా దగ్గరకు రానక్కరలేదు. వాళ్ళ తల్లిదండ్రులు యెంత భక్తితో, యెంత ప్రేమతో యెంత విశ్వాసముతో స్వామిదగ్గరకు వారి పిల్లలను పంపిస్తున్నారో వీరికి అర్థం కాదు. ఆ పిల్లలు మిలిట్రీలో చేరటానికి తల్లితండ్రులు యిష్టపడతారో, పడరో, మీరు మాత్రం పర్మిషన్ యిచ్చి పంపించేస్తే ఆ బాధ్యత మీదా, నాదా? పెద్ద పెద్ద ఎం.ఏలు బి.ఏలు చదినటువంటివాళ్ళే ఆ లైనులో ఏ విధమైన అభివృద్ధిలేకుండా ఉండిపోతున్నారు. అటువంటిది, ఇంటర్‌మీడియెట్‌లో వున్న చిన్నపిల్లల్ని అక్కడకు పంపిస్తే వాళ్ళు ఏమి పనిచేస్తారు? సిపాయిల మాదిరి పీనుగులెత్తుతుంటారు. అంతే వారిపని! అలాంటి దానికి యెందుకు పంపించాలి? ఇక్కడ పిల్లలు కనీసం పోస్ట్‌గ్రాడ్యుయేట్ వరకైనా చదవాలి. అప్పుడే వారి తల్లిదండ్రులకు సంతోషము. మనకు కూడా ఆనందము. అట్లుకాకుండా చిన్న చిన్న పిల్లలను అందరిని "స్వామి పర్మిషన్ అవసరం లేదు, స్వామిదగ్గరకు రానక్కరలేదు, స్వామితో చెప్పనక్కర లేదు", అని పర్మిషన్ ఇవ్వటం, పంపించటం. ఎవరిచ్చారు, మీకీ అధికారాలు? ఈ విధంగా వ్యవహారాలన్నీ అస్తవ్యస్తముగా జరిగిపోతుంటే నాకు చాలా బాధగావుంది. ఎవరిది హాస్టల్? మనది కాదా? యింతమాత్రము వీళ్ళకు బాధ్యత లేదా? "పిల్లలను యేవిధముగా పెంచాలి, యేవిధముగా చెయ్యాలి?" అని వాళ్ళకు తెలియటంలేదు. తమ బిడ్డలకంటె యెక్కువగా వీళ్ళను ప్రేమించాలి. వీళ్ళ బాధలను కొంతవరకు గమనించాలి.

sri sathyasai vahanamrutam

**'మీ భావములనుబట్టే నా భావము ఉంటుంది'**

ఈవిధమైనటువంటి మార్పులు, చేర్పులు చేయగలిగినప్పుడే యీ ఇన్‌స్టిట్యూషన్ చక్కగా రాణిస్తుంది. కేవలం స్వామికోసం వచ్చాం, స్వామికోసం వచ్చాం అని చెప్పినంతమాత్రమున నాకోసం వచ్చినట్లుకాదు. ఈ పిల్లలు కూడ యెంతమంది యీవిధముగా చెప్పారు? "స్వామీ! మీకోసమే వచ్చాం, మీరే మాకు కావాలి, మీరే మాకు కావాలి" అంటారు. ఎంతవరకు? పరీక్షలు పాసయ్యేవరకు, డిగ్రీలు తీసుకునేవరకు. తరువాత వారికి ఒక పిచ్చిపడుతుంది. ఏ పిచ్చి? పెండ్లి పిచ్చి. ఈ పెండ్లి పిచ్చి పట్టేటప్పటికి తల్లిదండ్రులపైన కుంటి సాకులు చెప్పి కనుపించకుండా వెళ్ళిపోతుంటారు. మీరు యెక్కడకైనా వెళ్ళండి. కానీ, మంచిగా వుండండి. మన ఆదర్శములను యేమాత్రము వుల్లంఘించకుండా చూచుకోండి. అయితే మంచి పిల్లలు కూడను లేకపోలేదు. ఏదో నూటికో కోటికో ఒక అదృష్టవంతుడు వుండి స్వామిని వదలిపెట్టలేనటువంటివారుకూడా వున్నారు. వారు యేవిధమైన భావముతో వున్నారో నేనుకూడ వారిని ఆవిధమైన భావముతోనే వాత్సల్యముగా చూచుకుంటూ వారికెట్టి కొరతలు లేకుండా వారికి తగినటువంటి బాధ్యతనిచ్చి చూచుకుంటున్నాను. "యద్భావం తద్భవతి". మీ భావములనుబట్టే నా భావము వుంటుంది. నేను ఒట్టి అద్దమువంటి వాడను. మీరు యేవిధముగావుంటే ఆవిధమైనటువంటి రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్ మీలో కలుగుతూ వుంటుంది.

**ఉపాధ్యాయులు పిల్లలలో ఉత్సాహ, ప్రోత్సాహములు పెంచి వారిని తీర్చిదిద్దటానికి కృషి చెయ్యాలి**

కనుక, జరిగిపోయింది ఏదో జరిగిపోయింది. యికముందైనా ఇలా జరగనివ్వకండి! ఈనాడు సంక్రాంతి పర్వదినము. క్రాంతి అంటే మార్పు. సూర్యుడు దక్షిణమునుండి ఉత్తరానికి బయలుదేరుతున్నాడు. "చంద్రమా మనసో జాతః చక్షోసూర్యోఽజాయత" యీ మనదృష్టిని ఉత్తరదిశకు మళ్లించి ఉత్తమమైన మార్గానికి, ఉన్నతమైన మార్గానికి మనము ప్రయాణము చేయించాలి. ఇకపైన యీక్రమశిక్షణను, యీ నిబంధనలను సక్రమముగా

srisathyasaivachanamrutam

పాటించి, సరియైన బాధ్యతలను ఎవరికి వారికిచ్చి మన ప్రొఫెసర్స్‌కూడా పిల్లలలో ఉత్సాహప్రోత్సాహములను పెంచి వారిని చక్కనిరీతిగా తీర్చిదిద్దటానికి తగిన కృషిచెయ్యాలి. స్వామియొక్క హృదయము పూర్ణస్వరూపమైనటువంటిది. స్వామిలో యెట్టి స్వార్థము లేదు. అట్టి పూర్ణస్వరూపమును పొందాలంటే మీ క్రియలన్నీ పూర్ణముగా వుంటుండాలి. ఏవిధముగాకూడను అసంపూర్ణముగా వుంటుంటే యీ పూర్ణత్వాన్ని పొందలేరు. ప్రతి విషయములోనూ కచ్చితంగా వుండాలి. అదీ నాయొక్క స్వభావము. ఏ చిన్నదాంట్లో సరిగా లేకపోయినప్పటికి నేను యేమాత్రం అంగీకరించను. కనుకనే పర్ఫెక్ట్‌గా మనయొక్క శక్తిని, తత్త్వమును, విద్యను సరైన మార్గములో ప్రవేశపెట్టి పిల్లలను ఉన్నతస్థాయికి తెప్పించాలి. ఈవిధమైన పరిస్థితిని తెప్పించటానికి తగినటువంటి కృషి మనము చెయ్యాలి. ఆవిధముగా చేసినప్పుడే స్వామి దయను, స్వామి ఆనందాన్ని మీరు అందుకొని విశాల ప్రపంచమునకుకూడను పంచటానికి వీలవుతుంటుంది. ప్రతివారము ఒక్కొక్క మీటింగ్ పెట్టుకొని, ప్రొఫెసర్స్‌తో అన్ని విధములకూడను డిస్కస్‌చెయ్యాలి. నేను యెన్నో పర్యాయములు చెప్పాను. తొమ్మిది నెలలకు పూర్వము కూడను చెప్పాను. ప్రతి 15 దినములకు ఒక్కొక్క మీటింగు జరుపుకోవాలని. ఇప్పుడు తొమ్మిది నెలలు గడచిపోయింది. యీనాటికికూడ ఒక్క మీటింగు జరగలేదు. మనందరి లక్ష్యము పిల్లలను చక్కగా ఉన్నతస్థాయికి తెప్పించి వాళ్ళద్వారా దేశమును అన్నివిధముల అభివృద్ధికి తేవాలి. అధికారులు, ప్రొఫెసర్స్ పిల్లల్ని స్వామికి ప్రతిరూపములుగా భావించి ఆపిల్లల యొక్క సేవలలోపల మీ సంపూర్ణమైనటువంటి శక్తిని వినియోగించండి. అదే స్వామిసేవగా భావించండి. మీకు ఏ అనుకూలములు కావలసినా నేను చేయటానికి సిద్ధముగా ఉన్నాను. ఇప్పటికి జరిగిపోయిందేదో జరిగిపోయింది. జరుగవలసినటువంటి దానికి తగిన ప్రయత్నముచేసి, ఎవరికి యేమేమి బాధ్యతనివ్వాలో ఆయా బాధ్యతలు వారికి అప్పగించి పనులు చేయించటానికి తగిన కృషిచెయ్యాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 15-1-1987న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam